
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.8, కనిష్ఠం 28.6



నిజామాబాద్
జిల్లా వార్తలు
5
ఆదివారం 21 ఏప్రిల్ 2024

ఆర్మూర్‌కు చేరిన ఈవీఎంలు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 20: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఆర్మూర్ నియోజకవర్గానికి సంబంధించిన 271 ఈవీఎంలు ఆర్మూర్‌కు వచ్చినట్లు ఆర్డీవో రాజాగౌడ్ తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచి పలు పార్టీ నాయకుల ముందు సీల్ వేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గజానన్, మాక్లూర్ తహసీల్దార్ షబ్బీర్, ఎలక్షన్ డీటీ పద్మ, డీప్యూటీ తహసీల్దార్ హరీశ్‌రావు, సర్వేయర్ షికారి రాజు, ఆర్ఐ అశోక్‌సింగ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



• ఇందల్వాయిలో నేలకొరిగిన పంటను చూపుతున్న రైతు



• వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి



• వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు



• డొంకేశ్వర్‌లో విద్యుత్ తీగలు తెగి పడడంతో చనిపోయిన మూడు నక్కలు

అకాల వర్షం అపార నష్టం!

- జిల్లావ్యాప్తంగా వడగండ్ల వాన
- 907 ఎకరాల్లో దెబ్బతిన్న వరి, మామిడి
- డొంకేశ్వర్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం
- ఆరు మండలాల పరిధిలో వివరాలు సేకరిస్తున్న అధికారులు
- తడిచిన ధాన్యాన్ని కొనాలని, ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్
- పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలంటున్న రైతులు
- తెగిపడిన విద్యుత్ తీగలు.. కూలిన స్తంభాలు

నిజామాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలకు అపార నష్టం వాటిల్లుతోంది. వడగండ్ల వర్షంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతాంగం కన్నీరుపెడుతోంది. పంట చేతికి వచ్చిన సమయంలో కురుస్తున్న వర్షాలకు ధాన్యం రాశులు రాలిపోతున్నాయి. పలు మండలాల పరిధిలో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. వడగండ్లు పడటంతో వరి పంట భారీ గా దెబ్బతినగా పలు మండలాల పరిధిలో మామిడి నేల రాలింది. భారీ వర్షంతోపాటు గాలులు వీయడంతో పలు గ్రామాల పరిధిలో ఇళ్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ లైన్‌లు తెగిపోయాయి. కొన్ని గ్రామాల పరిధిలో కరెంటు పోల్స్ నేలకొరిగాయి. జిల్లావ్యాప్తంగా వడగండ్ల వర్షం వల్ల రైతులకు భారీ నష్టాన్ని కలిగించగా అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు పంటలను పరి శీలిస్తున్నారు. ఆదుకుంటామని హామీలను ఇచ్చారు. వ్యవసాయ శాఖ తరఫున నివేదికను ప్రభుత్వానికి పంపించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు.

• జిల్లాలో భారీ నష్టం..

జిల్లాలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు పలు మండలాల పరిధిలో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వేగమైన గాలులతో ప్రధాన రహదారులతోపాటు గ్రామాల్లో భారీ చెట్లు సైతం నేలకొరిగాయి. విద్యుత్ లైన్‌లు దెబ్బతిన్నాయి. పలు గ్రామాల పరిధిలో తీగలు తెగిపడ్డాయి. కొన్నిగ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. జాతీయ రహదారిపై చెట్లు నేలకొరగగా హైవే అథారిటీకి చెందిన సిబ్బంది క్రేన్‌ల ద్వారా తీసివేశారు. జిల్లావ్యాప్తంగా వరి పంటకు పెద్దమొత్తంలో నష్టం వాటిల్లింది. మాక్లూర్, నందిపేట, నిజామాబాద్ రూరల్, డిచ్‌పల్లి, ఇందల్వాయి, నవీపేట మండలాల పరిధిలో సుమారు 891 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నది. వడగం డ్లు పడ్డ చోట ధాన్యం మొత్తం నేలరాలింది. ఈ వర్షానికి ఈ మండలాలతో పాటు ఇతర మండలాల్లో ఆరబోసిన ధాన్యం తడిచిపోయింది. ఒకేసారి వర్షం గాలులతో రావడంతో రైతులు ఆరబోసిన ధాన్యాన్ని కూడా తడవకుండా కాపాడే పరిస్థితి లేకుండాపోయింది. ధాన్యం కుప్పల్లో నీళ్లచేరి తడిచిపోయింది. వ్యవసాయ అధికారులు జిల్లావ్యాప్తంగా వర్షాలు పడ్డ ప్రాంతాల్లో పర్యటిస్తూ నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 30శాతానికి పైగా దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేసుకుంటున్నారు.

• పంటలను పరిశీలిస్తున్న అధికారులు

జిల్లాలో వరితోపాటు మామిడికి కూడా భారీనష్టం వాటిల్లింది. ఎక్కువ గ్రామాల్లో మామిడి ఈవర్షంతోపాటు గాలులు రావడంతో నేలరాలింది. వరి, మామిడి మొత్తంగా ప్రాథమిక అంచనాల ప్రకారం 907 ఎకరాల్లో 623మంది రైతులకు చెందిన పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనావేశారు. జిల్లాలో గాలులకు 50 ఇళ్ల వరకు దెబ్బతిన్నట్లు అధికారులు చెప్తున్నారు. ఈదురుగాలులకు చెట్లు విరిగిపడడంతో పలు గ్రామాల పరిధిలో కరెంటు తీగలు తెగిపడ్డాయి. వీటితోపాటు పోల్స్ విరిగిపోయాయి. యుద్ధప్రాతిపదికన విద్యుత్ సిబ్బంది విద్యుత్‌ను పునరుద్ధరించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను వేగంగా చేపట్టాలని రైతులు కోరుతున్నారు. వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. దెబ్బతిన్న పంటల వివరాలను సేకరిస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి వాజిద్ హుస్సేన్ తెలిపారు. ఆయా మండలాల పరిధిలో సర్వేనెంబర్ల ఆధారంగా గ్రామాల్లో పరిశీలించి వివరాలను సేకరిస్తున్నామని తెలిపారు.

సుభాష్‌నగర్: గత శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన అకాల వర్షానికి మామిడి పంటకు సైతం నష్టం వాటిల్లింది.

విద్యుత్ శాఖకు భారీనష్టం



చెట్లకు తగులుతున్న విద్యుత్ తీగలు

- పలుచోట్ల నేలకొరిగిన స్తంభాలు
- పాడైపోయిన పలు డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు
- రూ.30లక్షలకు పైగా ఆస్తి నష్టం

సుభాష్‌నగర్: శుక్రవారంరాత్రి కురిసిన అకాల వర్షంతో టీఎస్ఎన్‌పీడీసీయల్ సంస్థకు నష్టం వాటిల్లింది. ఒక్కసారిగా భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురియడంతో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. జిల్లాలో పలుకేంద్రాల్లో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు వర్షానికి పాడైపోయాయి. దీంతో విద్యుత్ శాఖకు నష్టం వాటిల్లింది. జిల్లాలోని సిరికొండ, ధర్పల్లి, భీమ్‌గల్, బాల్కొండ, నవీపేట, నందిపేట్ మండలాల్లో ఎక్కువనష్టం వాటిల్లింది. వర్షంతోపాటు ఈదురుగాలులు వీయడంతో జిల్లాలోని చాలాగ్రామాల్లో గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్‌శాఖ అధికారులు గంటలపాటు శ్రమించి విద్యుత్‌ను పునరుద్ధరించారు. కొన్నిప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరించేందుకు సాధ్యం కాకపోవడంతో ఉదయం తిరిగి పనులను ప్రారంభించి విద్యుత్ సరఫరా అయ్యేలా చూశారు. అకాలవర్షంతో విద్యుత్ శాఖకు సుమారు 30లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. జిల్లాలోని పలుప్రాంతాల్లో పది డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోయాయి. వీటితోపాటు 113 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

• విద్యుత్ తీగల కిందే చెట్లు

హరితహారంలో భాగంగా జిల్లా అంతగా మొక్కలను ప్రభుత్వం నాటించింది. దీంట్లో భాగంగా ఖాళీస్థలాల్లో మొక్కలు నాటారు. రోడ్లకు ఇరువైపలా సైతం మొక్కలను నాటారు. చాలాచోట్ల విద్యుత్ వైర్ల కిందనే మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి మొక్కల నుంచి చెట్లుగా మారడంతో విద్యుత్ వైర్లలోకి కొమ్మలు పెరిగాయి. దీంతో గాలి వీచినప్పుడల్లా విద్యుత్ తీగలకు తగిలి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది.



నేలకొరిగిన విద్యుత్ స్తంభం

రేపు జిల్లాకు సీఎం రాక



- ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి నామినేషన్‌లో పాల్గొననున్న సీఎం
- పాత కలెక్టరేట్ ఆవరణలో జరగనున్న కాంగ్రెస్ బహిరంగ సభ
- ఏర్పాట్లు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

నిజామాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం జిల్లాకు రానున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి నామినేషన్ వేస్తుండటంతో ఆయన హాజరుకానున్నారు. నిజామాబాద్ పాత కలెక్టరేట్ ఆవరణలో జరిగే బహిరంగ సభలో సీఎం పాల్గొననున్నారు. జిల్లాకాంగ్రెస్ నేతలకు సమాచారం అందించడంతో ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కలెక్టరేట్ గ్రౌండ్‌ను శనివారం సా యంత్రం ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జిలు వినయ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అంతిరెడ్డి రాజరెడ్డితోపాటు ఇతర నేతలు పరిశీలించారు. ఈ సభకు భారీ ఎత్తున క్యాడర్‌ను తరలించేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మెజార్టీ ఎంపీ సీట్లపై దృష్టిపెట్టిన కాంగ్రెస్ నేతలు జిల్లాలో కూడా ఈఏర్పాట్లను చేస్తున్నారు. నిజామాబాద్ సీటును కైవసం చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. నామినేషన్ రోజునే సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా కు రానుండటంతో సభను విజయవంతం చేసేందుకు నేతలు సిద్ధమవుతున్నారు. పార్లమెంట్ పరిధిలోని నిజామా బాద్, జగిత్యాల జిల్లాల పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ నేతలంతా హాజరయ్యే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. నామినేషన్ వేయడంతోపాటు జిల్లా కేంద్రంలోనే భారీ బహిరంగ సభను నిర్వహించడంతో క్యాడర్‌లో జోష్ నింపడంతో పాటు ఎన్నికల ప్రచారంలో అందరూ పాల్గొనే విధంగా చేసేందుకు ఈ సభను నిర్వహిస్తున్నారు. ఈ సభ ద్వారా ఓటర్ల మద్దతును కూడగట్టే ప్రయత్నాన్ని చేస్తున్నారు. ఈ దఫా ఎలాగైనా నిజామాబాద్ పార్లమెంట్‌ను కైవసం చేసుకునే విధంగా నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో సమావేశాలను మండలాల వారిగా నిర్వహిస్తున్నారు. మద్దతును కూడగట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. సీఎం సభను కూడా నాయకులు అంతా సమన్వయంతో నిర్వహించి జోష్ పెంచే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. సీఎం జిల్లాకు రాక ఖరారు కావడంతో పోలీసులు కూడా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పోలీసు బందోబస్తు ఏర్పాట్లకు సిద్ధమవుతున్నారు. పూర్తిస్థాయిలో ఏర్పాట్లను చేస్తున్నారు. సీఎం హోదాలో మొదటి సారి జిల్లాకు రానుండటంతో సభను విజయవంతం చేసేందుకు నేతలు కసరత్తు చేస్తున్నారు. అందరూ పాల్గొనే విధంగా ప్రయత్నాలను చేస్తున్నారు. సీఎం సభను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

డబుల్ బెడ్‌రూమ్ బిల్లులు ఇవ్వకుంటే..

ప్రాణత్యాగానికైనా సిద్ధం

• బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కోటగిరి, ఏప్రిల్ 20: బీఆర్ఎస్ హయాంలో పేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు ఎంతో కృషిచేశానని, ప్రభుత్వం మారడంతో బిల్లుల చెల్లింపులో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, బిల్లుల కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కోటగిరి మండలంలోని పొతంగల్ మండల కేంద్రంలో శనివారంరాత్రి బీఆర్ఎస్ రోడ్ షో కార్యక్రమాన్ని నిర్వహించారు. జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతు ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో రూ. 400 కోట్లతో డబుల్ బెడ్‌రూమ్ బిల్లులు చెల్లించామన్నారు. నుంచి మరో రూ.30కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉండగా దీని గురించి తాను సంబంధిత మంత్రితో మాట్లాడినట్లు చెప్పారు. కానీ ఈ ప్రాంతానికి చెందిన కొందరు నాయకులు బిల్లులు ఇవ్వవద్దని చెప్పడం సిగ్గుచేటన్నారు. పేదల బిల్లుల విషయంలో రాజకీయం చేయడం మానుకోవాలన్నారు. ఎన్నికల అనంతరం బిల్లుల కోసం లబ్ధిదారులతో కలిసి కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ప్రాణత్యాగానికైన సిద్ధమని పేర్కొన్నారు. అధికారం కోసం హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎంపీ ఎన్నికలలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శంకర్ పటేల్, జడ్పీ కోఆప్షన్ మెంబర్ సిరాజ్, విండో అధ్యక్షులు సిద్దు, పత్తి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మూడోరోజు ఏడు నామినేషన్లు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్20: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి మూడోరోజు శనివారం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇప్పటికే స్వతంత్ర అభ్యర్థిగా రాగి అనిల్, విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన బుక్య నందు, బహుజన ముక్తి పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన దేవతి శ్రీనివాస్‌కు శనివారం రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా ఆరె రాజేందర్, గంట చరితరావు, సయ్యద్ అస్కర్, మిర్యాల్‌కర్ జయప్రకాశ్ శనివారం నామినేషన్లు దాఖలు చేశారు. మొదటిరోజు రెండు, రెండోరోజు ఏడు, శనివారం ఏడు నామినేషన్లు మొత్తం 16 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈనెల 25న నామినేషన్ల గడువు ముగియనుంది.



ఊపందుకున్న ఉపాధి పనులు

• కూలీలకు పెరిగిన కూలి రేట్లు • పెరిగిన జాబ్ కార్డ్‌ల సంఖ్య



కూలీల సంఖ్య పెరిగింది

• నర్సయ్య, ఏపీవో, భీమ్‌గల్

గత ఆర్థిక సంవత్సరంలో కూలి రేట్లు రూ.150 నుంచి రూ.180గా ఉండేది. ప్రస్తుతం కేంద్రప్రభుత్వం పెంచిన కూలీ రేట్లతో సగటు కూలీ రూ.240 నుంచి 250 వరకు వస్తోంది. కూలీల సంఖ్య పెరిగింది. పెరిగిన కూలీలకు తగ్గట్టు పనులను గుర్తించాం. పనివద్ద అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేశాం. వచ్చే నెల మరింత కూలీల సంఖ్య పెరిగే అవకాశం వుంది.

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్ 20: గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించాలనే సదుద్దేశ్యంతో కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. గతంలో పనిచేసిన ఉపాధి హామీ కూలీ రేట్ల కంటే కూలీ రేటు పెరగడంతో గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల సంఖ్య పెట్టింపు పెరిగింది. జాబ్‌కార్డుల సంఖ్య పెరిగాయి. మండే ఎండలను సైతం లెక్క చేయకుండా గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో కూలీలు చురుగ్గా పనుల్లో పాల్గొంటున్నారు.

• పెరిగిన జాబ్‌కార్డులు

మండలంలోని 27 గ్రామ పంచాయితీల పరిధిలో ఉపాధి హామీ జాబ్‌కార్డ్‌లు 12028 ఉన్నాయి. జాబ్ కార్డుల మొత్తం సభ్యులు 22315 ఉండగా ఇందులో యాక్టీవ్ కార్డులు 8528, పనికి వచ్చే కూలీలు 12,886గా ఉంది. గత సంవత్సరం ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలపై చేసిన ఖర్చు 8కోట్ల 59లక్షలు.. అందులో 100 రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలు 598 ఉన్నాయి. గత సంవత్సరం కల్పించిన ప్రభుత్వం 3,04,174 పని దినాలు కల్పించింది. సగటు కూలీ వేతనం 185 రూపాయలుగా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూలీ రేటు 272 నుంచి 300 రూపాయలకు కేంద్రప్రభుత్వం పెంచిచడంతో సగటు కూలీ 240 నుంచి 250 వరకు కూలీ వస్తోంది. ఉపాధీహామీ కూలీల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం గ్రామాల్లో ఉపాధిహామీ పనుల్లో భాగంగా చెరువుల్లో పూడికతీత, వ్యవసాయ పొలాలలకు నల్లమట్టి సరఫరా, కాలువల పూడికతీత, ఫారెస్ట్ ఏరియాలో నీటినిల్వ కందకాలు, భూమి అభివృద్ధి పనులు, చేపల చెరువులు, కందకాలు, భూమి అభివృద్ధి పనులు, హరిత హారంలో మొక్కల పెంపకం వంటి పనులు చేపడుతున్నారు.





• మోతె నాగరాజు (ఫైల్)

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో యువకుడు బలి

- నిషేధిత యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నావని.. రూ.5లక్షలు ఇవ్వకుంటే కేసు నమోదు చేస్తామని వేధింపులు
- మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 20: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని మగ్గిడి గ్రామానికి చెందిన మోతె నాగరాజు జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ డిగ్రి కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. నాగరాజు ఇటీవల తన మొబైల్‌లో ఓ గేమింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. ఆ వెంటనే నాగరాజ్‌కు సైబర్ నేరగాళ్లు ఫోన్‌చేసి నిషేధిత యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నావని, నీపై కేసు నమోదు చేస్తామని, లేదంటే రూ.5లక్షలు ఇవ్వాలని బెదిరించారు. వారి బెదిరింపులకు భయపడి తీవ్ర మనస్థాపంలో నాగరాజు గురువారం గడ్డి మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులుఅతడిని ఓప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు.

గంగమట్టిని తరలిస్తున్న టిప్పర్‌లకు జరిమానా

నందిపేట, ఏప్రిల్ 20: నందిపేట మండలం నుంచి గంగమట్టిని తరలిస్తున్న తరసులు, టిప్పర్‌లకు జరిమానా విధించినట్లు ఎస్సై జి.రాహుల్ తెలిపారు. ఓవర్‌లోడ్, అధిక వేగం సమాచారం లేకుండా మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న కారణంగా 20వాహనాలకు గాను రూ.26వేల 800 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. అత్యధిక బరువు, అధిక వేగంతో వాహనాలను నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై జి.రాహుల్ హెచ్చరించారు.

పంట కొనుగోళ్లను వేగవంతం చేయాలి

పెద్దబజార్, ఏప్రిల్ 20: పంట కొనుగోలు కేంద్రాలను వేగవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేశ్ అన్నారు. శనివారం నగరంలోని నాందేవ్‌వాడలోగల రైతుసంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పంట పండించి కొనుగోలు కేంద్రాల వద్దకు తెచ్చినప్పటికీ అకాల వర్షాల వల్ల చేతికొచ్చిన పంట నాశనం కాకుండా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు దేవేందర్‌సింగ్, లక్ష్మి, మురళి, పలువురు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

'వ్యవసాయ పనిముట్లు, విత్తనాలపై 50 శాతం సబ్సిడీ ఇవ్వాలి'

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 20: వ్యవసాయ పనిముట్లు, ఉత్పత్తి సాధనాలు, మినీట్రాక్టర్‌లు, విత్తనాలపై రైతులకు 50శాతం సబ్సిడీ ఇవ్వాలని ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.ప్రభాకర్, కార్యదర్శి దేవరాం డిమాండ్ చేశారు. శనివారం ఆర్మూర్‌లోని మాస్‌లైన్ పార్టీ కార్యాలయం కుమార్ నారాయణ భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రైతాంగానికి పెద్దపీట వేస్తానని చెప్పిన గత కేసీఆర్ ప్రభు త్వం సబ్సిడీలను రద్దు చేసిందని అన్నారు. రైతులకు రైతు బంధు అందజేస్తున్నామన్న సాకుతో సబ్సిడీలను ఎత్తివేయడం అన్యాయమన్నారు. గత ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీ ఏకకాలంలో రద్దు చేస్తామని చెప్పి దశల వారీగా కొంత వరకే రద్దు చేయడంతో రైతులు పెట్టుబడుల కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి తలెత్తయన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాము అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ ఏకకాలంలో రద్దు చేస్తామని తమ ఎన్నికల ప్రణాళికలు హామీ ఇచ్చి ఇంత వరకు అమలు చేయకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సీపీఎం మాస్‌లైన్ కార్యాలయలో అధ్యక్షుడు చంద్రశేఖర్ అధ్యక్షత సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకు న్నారన్నారు. ఇందులో భాగంగా సబ్సిడీ అందజేయాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 15నుంచి జూన్ నెల మొదటివారం వరకు ఏఐకేఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేయనున్నట్లు వారు తెలిపారు. ఇందులో జిల్లా నాయకులు ఆకుల గంగారాం, రాజన్న, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ తండాలో బాల్య వివాహాలపై గిరిజనులకు అవగాహన

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 20: మండంలోని నర్సాపూర్ సోమిడిర్యాగడి (ఎస్ఆర్) తండాలో శనివారం ఐసిడిఎస్ అద్వర్యంలో బాల్యవివాహాలపై ఆవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఏసీడీపీవో జ్ఞానేశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బాలరక్షక్ భవన్ సిబ్బంది చిత్రప్రదర్శన ద్వార బాల్య వివాహలు, నిరోధక చట్టాలు, కలిగే నష్టలు, భ్రూణహత్యలు, బాలలహక్కులు, తదితర అంశాలపై తాండి గిరిజనులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ ఏసీడీపీవో జ్ఞానేశ్వరి మాట్లాడారు. ఇందులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరస్వతి, ఐసీపీఎస్ గణేష్, సీహెచ్ఎల్ పీసీ జ్యోత్స్న దేవి, బీల్‌సింగ్, బానోత్‌బాబు, మహిళా సాధికారత కేంద్ర జెండర్ స్పెషలిస్టు కవిత, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ప్రమాదాల నివారణ కోసం చర్యలు తీసుకోవాలి : సీపీ

ఖిల్లా, ఏప్రిల్ 20:ముందస్తు అగ్నిప్రమాదాల నివారణకు ప్రతీఒక్కరు చర్యలు తీసుకోవాలి, ముఖ్యంగా వాణిజ్యసముదాయాల వారు, బడా కాం ప్లెక్స్‌ల నిర్వాహకులు ప్రత్యేకంగా అగ్నిప్రమాద నివారణ ఏర్పాట్లు చేసుకోవాలని ఇందులో ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగనేవార్ సూచించారు. శనివారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల, కళాశాలల, వాణిజ్యసముదాయాల నిర్వాహకులు అగ్నిప్రమాదాల నివారణ చర్యల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని తక్కువ ఖర్చుతో కూడిన వివిధ రకాల ఆధునిక పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఇలా చేయడం వల్ల ముందస్తు అగ్నిప్రమాదాలను నివారించుకునే అవకాశాలు ఉంటాయన్నారు. అగ్నిప్రమాదాలు జరిగిన సమయంలో ఆస్తి, ప్రాణ నష్టం జరిగే అవకాశాలుంటాయని తెలుసుకోవాలన్నారు. నిబంధనలు పాటించని వాణిజ్య సముదాయాలను గుర్తించి శాఖపరమైన తగు చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజలకు అగ్నిప్రమాదాలపై అవగాహన లేకపోవడం వల్ల గతేడాది 274 అగ్నిప్రమాదాలు సంభవించి కోట్ల రూపాయల ఆస్తి నష్టం జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. అగ్నిప్రమాదాల నివారణలో అవగాహన కల్పించడంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉందన్నారు. ఇదే కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ డివిజనల్ అధికారి మురళీమనోహర్‌రెడ్డి, సహాయక అధికారి భానుప్రతాప్‌లు ఆ శాఖకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అగ్నిమాపక శాఖాధికారి నర్సింగ్‌రావ్, సిబ్బందితో ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందితో విన్యాసాలు చేయించారు.

● హనుమాన్ శోభయాత్రను శాంతియుతంగా నిర్వహించాలి

ఖిల్లా: హనుమాన్ జయంతి శోభయాత్ర శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సీపీ కల్మేశ్వర్ సింగెనవార్ అన్నారు. శనివారం రాత్రి నిజామాబాద్ పోలీస్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ భవనంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలో ఈనెల 23న నిర్వహించే హనుమాన్ శోభయాత్ర, అన్నదాన కార్యక్రమాలు శాంతియుతంగా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన జాగ్రత్తలు వహించాలన్నారు. శోభయాత్రలో పాల్గొనే ప్రజలు నిబంధనలు పాటిస్తూ పోలీసువారికి సహకరించాలన్నారు. ఎలాంటి రూమర్లు నమ్మవద్దని ప్రతీ ఒక్కరు స్నేహబావంతో ఉండాలన్నారు. ప్రజలను రెచ్చగొట్టే విధంగా స్పీచులు, పాటలు పెట్టరాదన్నారు. సోషల్‌మీడియాలో రెచ్చగొట్టే పోస్టింగులు పెట్టరాదని, అనునిత్యం సోషల్ మీడియాపై పటిష్టమైన నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో జిల్లా అదనపు డీసీపీ బి.కోటేశ్వర్‌రావు, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, ట్రెయినీ ఐపీఎస్ బి.చైతన్య రెడ్డి, ఏసీపీ ఎల్.రాజావెంకట్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, సీఐలు, ఎస్ఐలు, విశ్వహిందు పరిషత్, హిందూవాహిని, తదితరులున్నారు.

పలువార్డుల్లో బీజేపీ ప్రచారం



ఆర్మూర్ పట్టణంలో ప్రజలకు కరపత్రాలను అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్20: మున్సిపల్ పరిధిలోని 10, 3, 25వార్డులలో శనివారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతీ ఒక్కరు బీజేపీ పార్టీకి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పనుల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు లోక భూపతిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, ఓబీసీమోర్చ జిల్లా అధ్యక్షుడు యామాద్రి బాస్కర్, బీజేపీ నాయకులు రాంరెడ్డి, గుర్రం విజయానంద్, పులియుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: ఎంపీగా మరోసారి ధర్మపురి అర్వింద్‌ను గెలిపిం చాలని ఇంటింటికి వెళ్లి బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. శనివారం మండలంలోని బ్రాహ్మణ్‌పల్లి గ్రామంలో బీజేపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజేందర్, జిల్లా సంస్కృతిక కన్వీనర్ పోశన్న, బూత్ అధ్యక్షుడు రవిరాజ్, బీజేపీ నాయకులు మోహన్, పృధ్వీరాజ్, రోహిత్, రితేష్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఫోటోరైటప్: 32బీఎన్‌పీ20: రుద్రూరులో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

రుద్రూరు: రుద్రూరు మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ప్రతి గడప గడపకు బీజేపీ ప్రచారం ముమ్మరం చేశారు. ఈ కార్యక్రమంలో రుద్రూరు బీజేపీ మండల అధ్యక్షుడు ఆలపాటి హరికృష్ణ, చందూరి హన్మాండ్లు, ప్రధాన కార్యదర్శి ఏముల గజేం దర్, వడ్ల సాయినాథ్, బీజేవైఎం మండల అధ్యక్షులు రుద్రూరు మండల బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో అఖండ శివనామ సప్తాహ



బోధన్ శివాలయంలో అఖండ శివనామ సప్తాహ దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్20: శ్రీ క్రోధి నామ సంవత్సరంలో నిత్యం శివ నామ స్మరిస్తే సకల శుభాలు కలుగుతాయని శ్రీ సిద్ది లింగాప్ప స్వామి, మల్లికార్జున అప్పా స్వామిలు అన్నారు. బోధన్ పట్టణంలోని ఏక చక్రేశ్వరాలయంలో శనివారం అఖండ శివనామ సప్తాహ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని 108శటస్థల బ్రహ్మ మల్లికార్జున శివచార్య స్వామి, కౌలాస్ పీఠాధిపతులు వేద మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి సప్తాహను ప్రారంభించారు. ఈ సందర్భంగా శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, దీపారాధన, పూజలు నిర్వహించారు. అనంతరం అఖండ శివనామ సప్తాహ విశిష్టతను వివరించారు. ప్రతి వీర శైవుడు శివచార లింగాన్ని మెడలో ధరించి నుదటిన భస్మాన్ని ధరించి అనునిత్యం శివనామ స్మరణ, పంచాక్షరి మంత్రాన్ని జపిస్తే సకల శుభాలతో పాటు మోక్షం లభిస్తుందని భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాగనాథ్ రావు, లక్ష్మణ్ పటేల్, నర్సింగాప్ప, ప్రకాష్ రావు, గంగాధరప్ప, శివాలయం కమిటీ చైర్మన్ హన్మంత్ రావు, వీరశైవ సమాజ్ ప్రతినిధులు శ్యాంరావు, రాజేశ్వర్ పటేల్, అజయ్ కుమార్, విఠల్ అప్ప, ప్రభు అప్ప, శివ కుమార్, గణపతి అప్ప, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లిలో ఆదినాథస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్20: జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో శ్రీ ఆదినాథ స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు, జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 25వ తేదీ వరకు దేవాలయం జాతర ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 21న యజ్ఞం, ప్రత్యేక పూజలు, స్వామివారి పల్లకిసేవ, 22న యజ్ఞం, ప్రత్యేక పూజలు, పల్లకిసేవ, 23న రథోత్సవం,24న చక్రతీర్థం,25న స్వామివారి నాగవెళ్లి జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు సాయిరెడ్డి, గంగారెడ్డి, దేవదానం తెలిపారు.
రైటప్ః13బిఎన్‌పీ20: నవీపేట పోలీసులను ఆశ్రయించిన బాధితులు

నవీపేటలో నెల్లూరు వ్యాపారులపై దాడి



నవీపేట పోలీసులను ఆశ్రయించిన బాధితులు

నవీపేట,ఏప్రిల్20: నవీపేటలో శనివారం జరిగిన మేకల సంతలో నెల్లూరు జిల్లాకు చెందిన 15మంది వ్యాపారులపై నిజామాబాద్ ఆరె కటికె సంఘం వ్యాపారులు దాడి చేశారు. బాధితులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తాము ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా బోగోలు మండలం కడనూతలకు చెందిన వారమని ప్రతి శనివారం నవీపేటలో జరిగే మేకల సంతలో తాము గొర్రె పొట్టెలను కొనుగోలు చేసి తమ ప్రాంతంలో విక్రయించి ఉపాధి పొందుతున్నామని అన్నారు. గొర్రె పొట్టెలను తాము సంతలో కొనుగోలు చేస్తుండగా నిజామాబాద్‌కు చెందిన ఆరె కటికె వ్యాపారులు వచ్చి తమపై దాడి చేశారని వారు పేర్కొన్నారు. ఆంధ్ర ప్రాంతం నుండి వచ్చి గొర్రె పొట్టెలను కొనుగోలు చేయడంతో ఇక్కడ ధరలు పెరుగుతున్నాయని నవీపేట సంతకు ఇక ముందు రాకూడదని బెదిరిస్తూ దాడి చేశారని వారు వాపోయారు. దీనికి తోడు తాము కొనుగోలు చేసిన 45గొర్రె పొట్టెలను తమ వాహనంలో ఎక్కించుకున్నారని తాము బ్రతిమిలాడగ 29గొర్రెలను తిరిగి ఇవ్వగా 16గొర్రె పొట్టెలను వారు ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. దీంట్లో ఒక గొర్రె పొట్టెలును వారు నేలకేసి బాదడంతో చనిపోయిందని అన్నారు. ఈవిషయంలో తమకు న్యాయం చేయాలని బాధితులు దుర్గా, అఖిల్, శ్రీను, చిన్న అబ్బయ్య, ప్రసాద్ తదితరులు పేర్కొన్నారు. నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని అన్నారు. ఈ విషయంపై ఎస్ఐ యాదగిరిగౌడ్‌ను వివరణ కోరగా బాధితుల ఫిర్యాదు మేరకువిచారణ జరపుతున్నామని అన్నారు.

జాతీయ రహదారిపై బైకును ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

● గాయపడ్డ వారు ఇద్దరు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 20: నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని తెలంగాణ యూనివర్సిటీ ఎదుట జాతీయ రహదారి 44 పై శుక్రవారం అర్థరాత్రి బైకు ను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో నడిపల్లి తాండ కు చెందిన టీయూ ఔట్ సోర్సింగ్ సిబ్బంది బట్టు సురేశ్ ఆయన సోదరుడు బట్టు సతీశ్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని జిల్లా కేంద్రంలోని హోప్ ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నారు. గత అర్థరాత్రి సురేశ్ కు నలత గా ఉండటంతో ఆయన సోదరుడు సతీశ్ బైకు (ఏపీ 25 ఏక్యూ 5423) పై ఆస్పత్రికి తరలించే సమయంలో జాతీయ రహదారిపై గుర్తు తెలి యని వాహనం అతి వేగంగా ఢీ కొనడంతో సోదరులు ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి గాయపడ్డ వారిని 108లో ఆస్పత్రికి తరలించారు. ఒకే కు టుంబం లో ఇద్దరు సోదరులు తీవ్రంగా గాయపడటంతో కుటు ంబ సభ్యులు, తండావాసులు కన్నీరు మున్నీరుగా విలపిస్తు న్నారు. డిచ్‌పల్లి పోలీస్‌లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలి పారు.



చికిత్స పొందుతున్న సోదరులు

నిధులు లేక ముందుకు సాగని పనులు

● గ్రామాల్లో అభివృద్ధి శూన్యం ● నిధుల జాడ కరువు ● తాగునీటి పనులకు సైతం ఇబ్బంది ● ఇబ్బందులో పాలక వర్గం

కోటగిరి, ఏప్రిల్ 20: గ్రామ పంచాయతీలలో నిధులు లేక పనులు ముందుకు సాగడం లేదు. చిన్నచిన్న పనులు పూర్తి చేయడానికి కూడా అవకాశం లేక పంచాయతీ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. పాలకవర్గాల పదవి కాలం ముగిశాక ప్రత్యేక అధికారులను నియమించిన వారిలో కొంతమంది గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో పంచాయతీల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది.



కోటగిరి మండల కేంద్రంలోని మైనారిటీ కాలనీలో అధ్వానంగా మారిన మురికి కాలువ

● నిధుల జాడ కరువు

జిల్లాలో 530గ్రామ పంచాయతీలు ఉండగా ఫిబ్రవరి 2నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. గ్రామ కార్యదర్శులతో కలిపి వీరికి చెక్ పవర్ ఇచ్చారు. కాగా పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనాభా ప్రతిపాదికన నిధులు కేటాయిస్తుండగా దాదాపు ఏడాది నుంచి నిధులు రావడం లేదు. ఎన్నికలకు ముందు నామ మాత్రంగా కొంత మొత్తం పంచాయతీల్లో జమ అయింది. ఆర్థిక సంఘం నిధులు పూర్తిస్థాయిలో రావడం లేదు. సుమారు ఏడాదిన్నర నుంచి నిధులు రాక జనరల్ ఫండ్‌తో పాటు మిగత చాలిచాలని నిదులతో పల్లెల్లో నెట్టుకు రావడం కార్యదర్శులకు తలకు మించిన భారం అవుతోంది. కొన్ని పంచాయతీల్లో ట్రాక్టర్ల వాయిదాలు చెల్లించేందుకు సైతం నిదులు లేని పరిస్థితి తలెత్తింది. మల్టీపర్పస్ వర్కర్లకు సుమారు నాలుగు నెలల వేతనాలు రాకపోవడంతో వారి కుటుంబాలను పోషించుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు.

● తాగునీటికి పనులకు సైతం ఇబ్బంది

వేసవిలో గ్రామాలలో తలెత్తే తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు కార్యదర్శులకు తలకు మించిన భారం అవుతోంది. అప్పు తెచ్చి ఖర్చు చేయడం తమ వల్ల కాదని కార్యదర్శులు బాహటంగానే చెబుతున్నారు. గ్రామాలలో పైపులైన్‌ల లీకేజీలు, చేతి పంపుల మరమ్మతులు ఇతర పనులు చేపట్టడానికి కష్టంగా ఉందని కార్యదర్శులు వాపోతున్నారు. గ్రామాలలో తాగునీటి సమస్యలపై కార్యదర్శులను నిల దీస్తున్న ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. పొతంగల్ మండల కేంద్రంలో గత వారం రోజులుగా తాగునీటి సమస్య తలెత్తింది. మంజీర నది చెంతనే ఉన్న తాగునీటి సరఫరాలో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతుంది. ఎత్తొండ గ్రామంలో సర్పంచ్ పదవి కాల సమయంలోనే కొంత నిధులు ఖర్చు చేశారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో అప్పులు తెచ్చి ఖర్చు పెట్టారు. తాగునీటి సమస్య, పారిశధ్య సమస్యలకు, జీతాలకు ప్రైవేటు ఫైనాన్స్‌ల నుంచి అప్పులు తీసుకు వచ్చి ఖర్చు చేశారు. సర్పంచ్ పదవి కాలం ముగియగ ప్రత్యేక అధికారులను నియమించారు. తహసీల్దార్ ప్రత్యేక అధికారిగా కొనసాగాయి. ఇటీవల ఎన్నికల వేళ తహసీల్దార్ బదిలీ కావడంతో మరో తహసీల్దార్ చార్జి తీసుకున్నారు. గతంలో ఖర్చు చేసిన పనులకు తమకు సంబంధం లేదని ప్రత్యేక అధికారులు తేల్చి చెప్పడంతో కార్యదర్శి, మండల పరిషత్ అధికారులు చేసేదేమి లేక ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని గ్రామాలలో ప్రత్యేక అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. చిన్నచిన్న పంచాయతీల్లో పారిశుధ్య సమస్యలు పరిష్కరించలేని పరిస్థితి తలెత్తింది. ఇప్పటికైన ప్రత్యేక అధికారులు గ్రామాలలో పర్యటించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది.

సమస్యల పరిష్కారానికి కృషి



గ్రామాల్లో నిధుల కొరత ఉన్నప్పటికీ ఇతరత్రామార్గాలతో గ్రామాలలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నాం. తాగునీటి సమస్య, పైప్‌లైన్ లీకేజీలు త్వరితగతిన చేపడుతున్నాం.

- మనోహర్ రెడ్డి, ఎంపీడీవో, కోటగిరి

డిచ్‌పల్లిలో ఆంజనేయ స్వామి మహాపూజ



డిచ్‌పల్లిలో హనుమాన్ దీక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పిట్ల కృష్ణ



హనుమాన్ విగ్రహానికి అభిషేకం చేస్తున్న స్వాములు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 20: నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ఆంజనేయ స్వామి మహాపూజ వైభోపేతంగా పిట్ల కృష్ణ మహారాజ్, నాగభూషణంగురుస్వామి, ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. మహాగణ పతి, నవగ్రహ గౌరిమాత పూజ, ఆంజనేయ స్వామికి అభిషేకలు,నిర్వహించారు..డిచ్ పల్లి, ధర్పల్లి, సిరికొండ, జక్రాన్‌పల్లి, ఇందల్వాయి, మండలాల నుంచి వందలాది మంది స్వాములు, భక్తులు హాజరయ్యారు. ఈకార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులచారి హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని మండల కేంద్రానికి చెందిన మణికంఠ లక్ష్మీ నర్సయ్య స్వామి ఆధ్వర్యంలో నిర్వహిం చారు. అనంతరం అన్నప్రసాద వితరన చే శారు. పలు ప్రాంతాల నుంచి వచ్చి పూజ లు నిర్వహించిన గురుస్వాములుతో ప్రాగంణమంత ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. జైరామ..శ్రీరామ..జయజయ రామ అంటు మరు మోగింది.

ఏర్గట్ల నుంచి కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు



కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న సునీల్ కుమార్

ఏర్గట్ల, ఏప్రిల్ 20: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్క కార్యకర్త పని చేయాలని బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. శనివారం ఏర్గట్ల మండలం నుంచి వడ్డెర సంఘం, ముదిరాజ్ సంఘాల సభ్యులతో పాటు బీఆర్‌ఎస్ కార్మికశాఖ మండల అధ్యక్షుడు ఓర్సు రాములు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరగా ముత్యాల సునీల్ కుమార్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సోమ దేవరెడ్డి, మాజీ ఎంపీటీసీ గడ్డం లింగారెడ్డి, బద్దం లింగారెడ్డి, పన్నాల నర్సారెడ్డి, ముస్కు మోహన్, మేకల సాయన్న, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశం కోసం కోసం బీజేపీకే ఓటు వేయాలి

పెద్దబజార్, ఏప్రిల్ 20: దేశం కోసం, ధర్మం కోసం బీజేపీకే ఓటు వేయాలని తెలంగాణ ఉద్యమ జేఏసీ చైర్మన్ గోపాల్‌శర్మ అన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1980 నుంచి బీజేపీతో అనుబంధం ఉందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కష్టపడి పనిచేస్తే నిధులు, నియామకాలు కేసీఆర్ కుటుంబానికి దక్కాయని కేసీఆర్ స్కీమ్స్ అన్ని స్కామ్స్ మాత్రమేనని అన్నారు. కాళేశ్వరం పేరుతో కోట్లాది రూపాయలు నీటిపాలు చేశారన్నారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన ఉద్యమకారులకు మొండిచేయి చూపించి ఒక్కరికి కూడా పదవులు ఇవ్వలేదన్నారు. లిక్కర్ స్కామ్‌లో కవితకు ఐదు నుంచి ఏడు సంవత్సరాలు శిక్షపడే అవకాశం ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నిసార్లు పాలించిన మార్పు రాదని అభివృద్ధి జరగదన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకొని మోసం చేస్తున్నారని అన్నారు. ఎంపీ ఎన్నికలో ప్రతి ఒక్కరు బీజేపీ మోదీ బలపర్చిన అభ్యర్థులకు ఓటు వేసి దేశాభివృద్ధికి భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది శరత్ పాల్గొన్నారు.

నగరంలో గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్

నిజామాబాద్ అర్బన్ ఏప్రిల్20: యానిప్లస్ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ వారి ఆధ్వర్యంలో స్థానిక వంశీ ఇంటర్నేషనల్ హోటల్‌లో జరిగిన గ్లోబల్ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రామర్తి వంశీకృష్ణ తో పాటు 15 మంది విదేశీ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొనడం జరిగింది.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా నాగభూషణ్

నవీపేట,ఏప్రిల్20: భారతీయ జనతా పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని నందిగామకు చెందిన నాగభూషణ్‌ను శనివారం నియమించారు. ఈ మేరకు బోధన్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రెడ్డి, మేడపాటి ప్రకాష్‌రెడ్డిలు సంబంధిత నియామకపత్రాన్ని నాగభూషణ్‌కు అందజేశారు. అలాగే బీజేవైఎం మండల అధ్యక్షుడిగా బండారు రాజశేఖర్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఉన్నారు.

క్రికెట్ శిబిరం 23వ తేదీకి వాయిదా



శిబిరానికి హాజరైన క్రీడాకారులు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 20: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించాల్సి ఉన్న క్రికెట్ శిబిరం మంగళవారానికి వాయిదా పడినట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రెటరి వెంకట్ రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి గిరిరాజ్ కాలేజ్ మైదానం పచ్చికగా ఉండడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. ఇప్పటికే 70మంది క్రికెట్ క్రీడాకారులు పేర్లను నమోదు చేసుకున్నారు. 23వ తేదీన తిరిగి క్రికెట్ శిబిరాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సురేష్, వినోద్, ఆర్గనైజింగ్ సెక్రెటరి పారస్, నయీం, లలిత్ రెడ్డి, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పెద్దమ్మతల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ట

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 20: నగరంలోని దుబ్బలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట, శిఖర ప్రతిష్ట, కుంభప్రోక్షణ కార్యక్రమాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. శ్రీక్షేత్రం స్వామి శ్రీశ్రీశ్రీ మధుసూదనానంద సరస్వతి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరుగనున్నాయి. ఈనెల 24వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు జరుగనున్నాయి.పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ పునఃనిర్మాణ కమిటీ అధ్యక్షులు శరత్, ప్రధాన కార్యదర్శి శ్యామ్, కోశాధికారి అజ్జన్ శేఖర్‌లు తెలిపారు. శనివారం ఆలయ పునః నిర్మాణ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను దుబ్బ ప్రాంతానికి చెందిన గడుగు గంగాధర్, దారం సాయిలు, అజ్జన్ ప్రకాశ్, యోగా ప్రభాకర్, తదితరులు ఆవిష్కరించారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఖైదీలు లీగల్ ఎయిడ్ సదుపాయాన్ని వినియోగించుకోవాలి



ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న లీగల్ ఎయిడ్ సిబ్బంది

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్, 20: జిల్లా జైలులో శిక్షపడి ఎలాంటి న్యాయ సదుపాయం లేని ఖైదీలు లీగల్ ఎయిడ్ సదుపాయం సద్వినియోగం చేసుకోవాలని చీఫ్ లీగల్ ఎయిడ్ రాజ్‌కుమార్ సుబేదార్ తెలిపారు. శనివారం సారంగపూర్‌లోని జిల్లా కారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలు అనుభవిస్తున్న శిక్షలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు ఖైదీలకు లీగల్ ఎయిడ్ సదుపాయం గురించి వివరించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు యావత్ దేశంలో లీగల్ ఎయిడ్ వ్యవస్థను పటిష్టం చేశారన్నారు. స్వంతంగా న్యాయవాదులను సమకూర్చుకునే స్థోమత లేని ఖైదీలకు, ఆయా న్యాయస్థానాల్లో వారి కేసులు వాదించేందుకు, న్యాయ సహాయం చేయడమే ఈ లీగల్ ఎయిడ్ లక్ష్యమని వివరించారు. న్యాయ సహాయము అవసరమున్న ఖైదీలు లీగల్ ఎయిడ్ కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూచించారు. దీని ద్వారా కేసులు సత్వరంగా పరిష్కారం అవుతాయని తెలిపారు. దీర్ఘకాలంలో జైలులో శిక్ష పొందుతున్న ఖైదీలకు ఈ సౌకర్యం చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ సభ్యులు రాజ్‌కుమార్ సుభేదారి, గంగోనే శుభం, ప్రమోద్, జైలు అధికారులు రాజశేకర్, సాయికుమార్ తదితరులున్నారు.



గడ్డివాము దగ్ధమైన దృశ్యం

రుద్రూరులో గడ్డి వాము దగ్ధం

రుద్రూరు, ఏప్రిల్ 20 : రుద్రూరు మండల కేంద్రంలోని నెమలి జగన్‌కు చెందిన గడ్డివాము శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో దగ్ధమైంది. అటు వైపుగా వెళుతున్న హనుమాన్ స్వాములు గమనించి నీటితో మంటలను ఆర్పివేశారు. గడ్డివాము యజమాని జగన్‌కు వెంటనే సమాచారం అందించారు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు 500 కట్టల గడ్డివాము దగ్ధం కావడంతో సుమారు 50 వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తంచేశారు.

ముగిసిన శ్రీరామ నవమి ఉత్సవాలు

మోస్రా,ఏప్రిల్20: మండల కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. శనివారం యజ్ఞం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. యజ్ఞ ప్రభావం వల్ల సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని, ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని కార్యక్రమాలు నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాస చార్యులు, నవీన్ పంతులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయానికి కూలర్ వితరణ



గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కూలర్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 20: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదువుతున్న పాఠకులకు వేసవి ఇబ్బందులు తెలుసుకొని గతంలో పాఠకుడిగా ఉన్న నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం జామ్ గ్రామానికి చెందిన గడ్డం రామకృష్ణారెడ్డి కూలర్‌ను అందజేశారు. వేసవి ఎండ వేడి వల్ల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న పాఠకులకు ఇబ్బందులు కలుగుతున్నాయని జిల్లా కేంద్ర గ్రంథాలయంలోని మొదటి అంతస్తులోని మీటింగ్ హాల్‌లో కూలర్‌ను ఏర్పాటు చేశారు. కూలర్ ఏర్పాటుకు సహకరించిన రామకృష్ణారెడ్డికి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ధన్యవాదాలు తెలిపారు.

హనుమాన్ విజయయాత్ర ప్రచార రథం ప్రారంభం



జెండా ఊపి ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 20: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 23న నిర్వహించనున్న హనుమాన్ విజయయాత్రకు సంబంధించిన ప్రచార రథాలను శనివారం నగరంలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌గౌడ్, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు దినేష్‌ఠాకూర్‌లు జెండా ఊపి ప్రారంభించారు. హిందూ బంధువులంతా హనుమాన్ విజయయాత్రను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు కృష్ణ, దయానంద్, దాత్రిక రమేష్, ప్రవీణ్, భజరంగ్‌దళ్, ప్రతినిధులు మహేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

జానకంపేటలో చోరీ



వివరాలను సేకరిస్తున్న పోలీసులు

ఎడపల్లి,ఏప్రిల్ 20: ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామంలో గల చిన్న హనుమాన్ మందిరం దగ్గర నివాసముంటున్న నీలం లింగన్న అనే వ్యక్తి రాత్రి కురిసిన ఈదురు గాలుల వర్షానికి విద్యుత్ అంత రాయం ఏర్పడడంతో ఉక్కపోతను తట్టుకోలేక తన బార్య, పిల్లలతో కలిసి రాత్రి వేళ ఇంటి తలుపులు తెరిచి నిద్రపోయారు. ఇదే అదనుగా భావించిన గుర్తుతెలియని దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న సుమారు నాలుగున్నర తులాల బంగారం, 20 తులా ల వెండి, 25 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఉదయం నిద్రలేచి ఇట్టి విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యు లు ఉక్కపోతపోస్తుందని తలుపులు తెరిచిపడుకుంటే ఇంటిని గుల్ల చేశారని లబోదిబో మంటూ ఎడపల్లి పోలీసులకు సమాచారం అందిం చారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధా రాలు సేకరించి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణ తెలిపారు.



స్ట్రాంగ్‌రూంను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి

స్ట్రాంగ్ రూంను పరిశీలించిన ఎన్నికల అధికారి

మద్నూర్, ఏప్రిల్ 20: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి జరగబోయే ఎన్నికల కోసం తీసుకవచ్చిన ఎన్నికల సామగ్రి భద్రపర్చిన స్ట్రాంగ్‌రూంను శనివారం జుక్కల్ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో పాటుగానే స్ట్రాంగ్‌రూం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు, ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ముజీబ్, నాయబ్ తహసీల్దార్ భరత్, సీనియర్ అసిస్టెంట్ విజయ్‌లు ఉన్నారు.

లైంగిక వేధింపుల బాధితులకు చెక్కుల పంపిణీ

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 20: కామారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా జడ్జి ఎస్ఎన్ శ్రీదేవి చేతుల మీదుగా లైంగికంగా వేధింపబడ్డ బాలికలకు నష్టపరిహారం కింద రూ.3లక్షలు, రూ.2లక్షల ఫిక్స్ డిపాజిట్ చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశానుసారం సెక్షన్ 357ఏ బాధితుల పరిహారం కింద పిల్లలపై లైంగిక వేధింపులు పోక్సో చట్టం కింద నమోదైన కేసులకు ఈ పరిహారం కింద నష్ట పరిహారాన్ని జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం బాధితులకు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జిల్లా జడ్జి లాల్‌సింగ్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి తదితరులు పాల్గొన్నారు.



ఎక్సైజ్ పోలీసుల అదుపులో నిందితుడు

డోంగ్లీ మండలంలో దేశీదారు పట్టివేత

మద్నూర్, ఏప్రిల్ 20: మండలంలోని డోంగ్లీ గ్రామంలో శుక్రవారం రాత్రి ఎక్సైజ్ అధికారులు జరపిన దాడుల్లో దేశీదారు పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపారు. డోంగ్లీ గ్రామానికి చెందిన గయక్వాడ్ అవినాష్, పాట్నే ప్రభాకర్‌లు అనుమతి లేకుండా మహారాష్ట్ర నుంచి దేశీదారు సీసాలను తీసుకవచ్చి అమ్ముతున్నారని అందిన సమాచారం మేరకు దాడి చేయగా అవినాష్ వద్ద 24 సీసాల దేశీదారు, ఒక మోటారు సైకిల్, పాట్నే ప్రభాకర్ నుంచి 1.350 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ నగేష్, సిబ్బంది ఎల్లయ్య, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ అపర్ణ

వర్షానికి దెబ్బతిన్న పంటల పరిశీలన

మాచారెడ్డి, ఏప్రిల్ 20: మాచారెడ్డి మండలంలోని ఎల్లంపేట, సోమారంపేట గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ ఈదురుగాలల వర్షానికి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో శనివారం ఏడీఏ అపర్ణ, మండల వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. ఎల్లంపేట క్లస్టర్‌లోని అంకిరెడ్డిపల్లి తండా పరిధిలో 62 ఎకరాల్లో, సోమార్‌పేట క్లస్టర్‌లో సుమారు 70 ఎకరాల్లో వర్షానికి పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. ఏఏ పంటలు దెబ్బతిన్నాయో వాటి వివరాలను నమోదు చేసి అధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో రమ్యశ్రీ, ఏఈవోలు సౌజన్య, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

డాన్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 20: కామారెడ్డి జిల్లా డాన్స్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి, బద్రి, కార్యదర్శిగా కార్తీక్‌యాదవ్, సహాయ కార్యదర్శులుగా అనిల్, మధు కోశాధికారిగా యమ్.స్వామిగౌడ్, సలహదారులుగా మోహన్, శైలజ కార్యవర్గ సభ్యులుగా అశోక్, అశోక్‌రావు, ఉదయ్, అభి, సున్ని తదితరులు పాల్గొన్నారు.

'కర్షక్ బీఈడీ కళాశాల అద్దె చెల్లించాలి'



యూనివర్సిటీ అధికారులకు వినతి పత్రం అందిస్తున్న కళాశాల సిబ్బంది

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 20: కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరంలో సీట్ల భర్తీ, అద్దె చెల్లింపుల విషయంలో శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు తెలంగాణ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి, అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్‌లను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలను స్థాపించిన కామారెడ్డి కాలేజ్ ఎడ్యుకేషన్ సొసైటీ కర్షక్ బీఈడీ కళాశాలను కూడా ప్రారంభించిందని తెలిపారు. సొసైటీ 2015లో భూములు, భవనాలు యావదాస్తులను ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు అప్పగిస్తూ తీర్మానం చేసిందని రిజిస్ట్రేషన్ జరిగిన 2017 మార్చి నుంచి జీవో 571 ప్రకారం అద్దె చెల్లించాలని అప్పటి కలెక్టర్ సత్యనారాయణ కర్షక్ బీఈడీ కళాశాల నిర్వాహకులను ఆదేశించారని తెలిపారు. అప్పట్లో వారు అంగీకరించిన ఆ ఆదేశాలను పాటించకుండా కోర్టు కేసులతో కాలయాపన చేస్తున్నారని ఎన్నిసార్లు నోటీసులు పంపించినా బకాయిలు చెల్లించకపోవడంతో యూనివర్సిటీ అధికారులకు వివరించామని తెలిపారు. కర్షక్ బీఈడీ కళాశాల ఇప్పటి వరకు రూ.7,91,148 బకాయి పడినట్లు తెలిపారు. కళాశాల విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు తామే బీఈడీ కళాశాలను నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ రిజిస్ట్రార్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కిష్టయ్య, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ట్యాంకులను శుభ్రంగా ఉంచాలి

- ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్



సిద్ధరామేశ్వరనగర్‌లో నీటి ట్యాంకు పనులను పరిశీలిస్తున్న దృశ్యం

భిక్కనూరు, ఏప్రిల్ 20: మండలంలోని ప్రతీ గ్రామంలో నీటి ట్యాంకులను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని భిక్కనూరు ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని సిద్ధరామేశ్వరనగర్, గుర్జకుంట, ర్యాగట్లపల్లి, బస్వాపూర్ గ్రామాలను పరిశీలించారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ పనులను, కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను, నర్సరీలను, నీటి ట్యాంకుల శుభ్రత పనులను, పైప్ లీకేజీ పనులను పరిశీలించి ఆయాగ్రామాల అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులను పరిశీంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీటిఎద్దడి లేకుండా చూడాలని, గ్రామ పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించడంతో పాటుగా విధులను సక్రమంగా నిర్వహించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించాలన్నారు, గ్రామాల్లో నీటి వృథా జరగకుండా చర్యలు తీసుకోవాలని, ఎవరైనా నీటిని వృథా చేస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.8వేల కోట్లతో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా: బీబీపాటిల్

నాగిరెడ్డిపేట, ఏప్రిల్20: తాను ఎంపీగా ఉన్న పదేళ్ల కాలంలో 8వేల కోట్లతో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ తెలిపారు. ఆయన శనివారం నాగిరెడ్డిపేటలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం నిర్విరామంగా కృషిచేసినట్లు తెలిపారు. విద్య, వైద్యం, రైల్వే, రహదారులు, ఉపాధి తదితర రంగాల్లో ఎనలేని కృషిచేసి కేంద్రం నుంచి భారీఎత్తున నిధులను తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేసినట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు తాను అభివృద్ధి చేయలేదంటూ అసత్య ప్రచారాన్ని చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. తాను లక్షకుపైగా ఓట్ల మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షురాలు అరుణతార, మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

- మళ్లీ మోదీ వస్తేనే అభివృద్ధి..

లింగంపేట: మళ్లీ మోదీ ప్రభుత్వం వస్తేనే గ్రామాలు సంపూర్ణ అభివృద్ధికి నోచుకుంటాయని జహీరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాజీ ఎంపీ బీబీపాటిల్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం లింగంపేట మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి భారి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, రాష్ట్ర నాయకుడు బాణాల లక్ష్మారెడ్డి, బీజేపీ నాయకులు మురళి, బొల్లారం సాయిలు, దత్తురాములు, రాంచందర్‌లతో పాటు నాయకులు ఉన్నారు.

'కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేద్దాం'

రామారెడ్డి, ఏప్రిల్20: జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంపీ సురేష్ షెట్కార్ తరఫున శనివారం కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ నారెడ్డిమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలను అరుహులైనవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలకేంద్రంలో 78వ బూత్‌లో గడపగడపకూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లక్ష్మాగౌడ్, ఉపాధ్యక్షుడు తూర్పురాజు, రామారెడ్డి పట్టణ ఉపాధ్యక్షుడు రవీందర్, జనరల్ సెక్రెటరీ గణేష్, సీనియర్ నాయకులు నర్సింలు, రత్నాకర్ గుప్తా, తూర్పు సుబ్బయ్య, రాహుఫ్, పారుక్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా అన్నారు. శనివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆదేశాల మేరకు పట్టణ, మండల, గ్రామస్థాయి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వినోద్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చెన్న లక్ష్మణ్, విద్యాసాగర్, గయాజుద్దీన్, అజార్ ఖాద్రి, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

సదాశివనగర్, ఏప్రిల్ 20: ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని తెలంగాణ రాష్ట్రంలోని ఆదర్శ నియోజకవర్గంగా చేసి చూపిస్తానని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ తరఫున మండలకేంద్రంలో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా ఎంపీగా పనిచేసిన బీబీపాటిల్ అసమర్థత వల్ల అనేక నిధులు వాపస్ వెళ్లడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలోని వెనుకబడిన నియోజకవర్గంగా పేరుగాంచిన ఎల్లారెడ్డిని పార్లమెంట్ ఎన్నికల తర్వాత అభివృద్ధి అంటే ఏ విధంగా ఉంటుందో నేను చేసి చూపిస్తానని తెలిపారు. ఉపాధి కూలీలతో కలిసి కాసేపు మాట్లాడి కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, రాజు, మహిపాల్‌రెడ్డి, మద్దెల భాగయ్య తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే





గొట్టిముక్కుల గ్రామంలో కురుస్తున్న వర్షం

దోమకొండలో అకాల వర్షం

- తడిసిన వరిధాన్యం కుప్పలు

దోమకొండ, ఏప్రిల్ 20: మండలంలో శనివారం ఉదయం గంటన్నర పాటు భారీ వర్షం కురిసింది. రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. వర్షపు నీటికి వరి ధాన్యం కొట్టుకుపోయింది. రాశులు చేసి కుప్పలపై టార్పాలిన్లు కప్పినా ఈదురు గాలులకు తార్పాలిన్‌లు కొట్టుకుపోయాయి. చేతికి వచ్చిన పంట కళ్ల ముందే నీటిలో కొట్టుకుపోవడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. వర్షంలో సైతం రైతులు ధాన్యాన్ని కాపాడుకునేందుకు నా అవస్థలు పడ్డారు.

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం'

రాజంపేట, ఏప్రిల్ 20: కాంగ్రెస్ పార్టీ గెలిస్తేనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గ్రామ అధ్యక్షుడు ఏనుగుల సాయిలు ఆధ్వర్యంలో గడపగడపకూ ప్రచారాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధిష్టానం సూచించిన ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ని భారీ మెజార్టీతో గెలిపిస్తే గ్రామాలు అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామఉపాధ్యక్షుడు శ్యాంరెడ్డి, వసీం, జనరల్ సెక్రటరీ బాలరాజ్, యూత్ అధ్యక్షుడు చందు, సీనియర్ నాయకులు సిద్దిరాములు, సంతోష్, సాయిలు, మైసయ్య, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బిచ్కుంద సీనియర్ నాయకులు

బిచ్కుంద, ఏప్రిల్ 20: బిచ్కుందకు చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బిచ్కుంద బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అసద్అలీ, మాజీ ఉప సర్పంచ్ నాగరాజు, దశరథ్, సాయిలు, ఖలీమ్ ఉన్నారు. రాజకీయ నాయకులుగా తమపరంగా ప్రజలకు మేలు జరగాలని మంచి ఉద్దేశ్యంతోనే కాంగ్రెస్‌లో చేరడం జరిగిందని ఎమ్మెల్యే సహకారంతో బిచ్కుంద అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగనాథ్‌పటేల్, తుకారం తదితరులు పాల్గొన్నారు.

హిందూ దేవతను కించపర్చుతూ
పోస్టులు పెట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

పెద్దబజార్, ఏప్రిల్ 20: హిందూ దేవత సీతమ్మతల్లిని అశ్లీలంగా అసభ్యకరంగా చిత్రీకరించి సోషల్ మీడియాలో ప్రచారం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిలు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. హిందూ దేవత సీతమ్మ తల్లిని అశ్లీలంగా అసభ్యకరంగా చూపిస్తూ ఫొటోను ఆలూర్ గ్రామానికి చెందిన తిర్మన్‌పల్లి నవనీత్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ ప్రజల మధ్య మతవిద్వేశాలు సృష్టించేందుకు కారణమవుతున్నవారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీకి వినతిపత్రం ఇచ్చినవారిలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ స్రవంతిరెడ్డి, తదితరులున్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



గంగమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

నాగిరెడ్డిపేట, ఏప్రిల్20: నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం గ్రామంలో ప్రాజెక్టు వద్ద నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో శనివారం జరిగిన విగ్రహ ప్రతిష్ఠా పన కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, గ్రామ మాజీ సర్పంచ్ విజిత, మండల కాంగ్రెస్ నాయకులు రాంచంద్రారెడ్డి, గంగారెడ్డి, వాసురెడ్డి, బోయిని విఠల్, షాహెద్, పర్వత్‌రావు, గోపాల్‌గౌడ్, జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

జంగంపల్లి బస్టాండ్ వద్ద ఒకరి మృతి

భిక్కనూరు, ఏప్రిల్ 20: మండలంలోని జంగంపల్లి గ్రామంలోని బస్టాండ్ వద్ద శనివారం ఒకరు మృతి చెందినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట్ మండలం ఎల్లారం గ్రామానికి చెందిన రుద్రబోయిన సాయిలు (44) కామారెడ్డికి ఇల్లరికం వచ్చాడు. అతడి భార్య నాలుగు సంవత్సరాల క్రితం మృతి చెందగా మేస్త్రీ పనులు చేస్తూ కుమారుడితో కలిసి ఉంటున్నాడు. గత కొన్ని రోజులుగా మానసికంగా బాధపడుతూ రోడ్లపై తిరుగుతున్నాడని, ఉదయం జంగంపల్లి బస్టాండ్ వద్ద మృతి చెందగా మృతుడి సోదరుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడు వడదెబ్బ, ఫిట్స్‌రావడంతో మృతిచెందిఉండవచ్చని ఎస్సై తెలిపారు.

నాగిరెడ్డిపేటలో బీజేపీ బైక్ ర్యాలీ

నాగిరెడ్డిపేట, ఏప్రిల్ 20 : నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో శనివారం బీజేపీ బైక్ ర్యాలీని జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. మండల కేంద్రంలోని రాంప్రతాప్ థియేటర్ నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ మండల కేంద్రం ప్రధాన రహదారి గుండా రామాలయం వరకు కొనసాగింది. అనంతరం ఈ బైక్ ర్యాలీ నాగిరెడ్డిపేట మండల కేంద్రం నుంచి లింగంపేట మండలానికి తరలివెళ్లింది. ఈ బైక్ ర్యాలీ కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్, జిల్లా బీజేపీ అధ్యక్షురాలు అరుణతార, రాష్ట్ర బీజేపీ కన్వీనర్ లింగారావు, మండల బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్, మాజీఅధ్యక్షుడు హన్మాండ్లు, మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

భిక్కనూరు, ఏప్రిల్20: మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన దాదాపు 200ల మంది తాజామాజీ సర్పంచ్ నర్సింలు యాదవ్ ఆధ్వర్యంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని నేరవేర్చుతుందన్నారు. కేసీఆర్ కుటుంబం పదేళ్ల రాష్ట్రాన్ని అన్నివిధాలుగా దోచుకుందన్నారు. రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై కాంగ్రెస్‌లోకి పెద్దఎత్తున చేరుతున్నారని అన్నారు. జహీరాబాద్ ఎంపీగా సురేష్ షెట్కార్‌ను బంపర్ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ సిద్దరాములు, దోమకొండ జడ్పీటీసీ తిర్మల్ గౌడ్, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సార్గు నరేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డాననేది అవాస్తవం'

భిక్కనూరు, ఏప్రిల్ 0: తాను గత 30 ఏళ్లుగా మాజీ ఎమ్మె ల్యే గంపగోవర్ధన్ వెన్నంటే ఉంటున్నానని, తాను ఎలాంటి పార్టీ కార్యకలపాలకు పాల్పడలేదని భిక్కనూరు మాజీ మార్కెట్ చైర్మన్ అమృతారెడ్డి అన్నారు. శనివారం భిక్కనూరులో ఆయన మాట్లాడుతూ తాను గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నానని, ఈ విషయం అందరికీ తెలుసని అన్నారు. తాను ఆనారోగ్య విషయంపై ఆసుపత్రిలో ఉండటం చూసి రామేశ్వర్‌పల్లి విండో చైర్మన్ భూంరెడ్డి, పాలకేంద్రం అధ్యక్షుడు కట్టకింది రవీందర్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్‌కు తనపై లేనిపోనివి చెప్పి తప్పుదోవ పట్టించారని అన్నారు. తాను పార్టీ మారేది లేదని, తనకు జీవితాన్నే ప్రసాదించిన మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్‌తోనే ఉంటానని అన్నారు. భూంరెడ్డి, రవీందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి కోవర్టులుగా పనిచేస్తున్నారని ఆరోపించారు.

అగ్రవర్ణ పేదల సమితి జిల్లా అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్



కిరణ్‌కుమార్

కామారెడ్డిటౌన్, ఏప్రిల్20: అగ్రవర్ణ పేదల సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్ నియమీతులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఆయనకు శనివారం నియామక పత్రాన్ని అందజేశారు.

అమ్మవారికి బోనాల సమర్పణ

దోమకొండ, ఏప్రిల్ 20: మండల కేంద్రంలోని వనదుర్గ పెద్దమ్మ 26వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆదివారం తిరుగు బోనాలు ఉంటాయని ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మణ్ తెలిపారు.

'దేశాభివృద్ధి కోసం బీజేపీ ఓటు వేద్దాం'

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 20: దేశం అభివృద్ధి చెందాలంటే బీజేపీకి ఓటు వేద్దామని పెద్దకొడప్‌గల్ బిజెపి మండల అధ్యక్షులు బాలాజీ పటేల్ పేర్కొన్నారు. శనివారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని లింగంపల్లి గ్రామంలో తోటి నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాజీ పటేల్ మాట్లాడుతు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో అధికారంలో ఉన్నప్పుడు అనేక స్కాంలు జరిగేవని, మోదీ ప్రధాని అయిన తర్వాత ఒక్క కుంభకోణం జరగలేదని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి పాటు రైతుల కోసం సబ్సిడీపై ఎరువులు అందజేస్తున్న ఘనత బీజేపీ సర్కార్‌దేనన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు సంజూపటేల్, అశోక్ పటేల్, లక్ష్మణ్, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు ఎక్కుతూ కిందపడి మహిళ మృతి

ఖిల్లా, ఏప్రిల్ 20: నడుస్తున్న రైలు ఎక్కబోయి ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడి మహిళ మృతి చెందిన ఘటన శనివారం జరిగింది. కామారెడ్డికి చెందిన పసుల రేవతి (39) నగరానికి వచ్చి శనివారం ఉదయం తిరిగి వెళ్లే సమయంలో నడుస్తున్న రైలు ఎక్కబోయి కాలుజారి రైలుకింద పడింది. ఈ ఘటనలో చేతు, కాలు విరిగి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త పరమేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - మనజామిల్ బాయ్స్
శాంతి - టిల్ స్క్వేర్
ప్రియా 70 - ది ఫ్యామిలీ స్టార్
ప్రియా 35 - గీతాంజలి మళ్లీ వచ్చింది

బాన్సువాడ

మహేశ్వరి - ది ఫ్యామిలీ స్టార్
వెంకటేశ్వర - పారిజాత పర్వం

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్ (కిలో)	100	180	210

